# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

## క్రైస్తవ మాసపత్రిక

JULY-2012

సంవత్సర చందా రూ.50/-

# క్రీస్తు సంఘములు సమర్పించు

# సత్యవాణి టి.వి. ప్రసారములు

ప్రతి ఆదివారం సాయంత్రం 6.00 గం॥లకు శుభవార్త

ప్రతి బుధవారం సాయంత్రం 6.30 ని॥లకు రక్షణ

ప్రతి గురువారం మధ్యాహ్నం 2.30 ని॥లకు రక్షణ

ప్రతి శనివారం ఉదయం 8.00 గం॥లకు ఆరాధన

ఛానల్‌లలో వీక్షించండి.

ఉచిత బైబిలు కరస్పాండెన్సు కోర్సులో చేరండి. ఆ కోర్సు పూర్తిచేసి ఒక బైబిలును ఉచితముగా బహుమతి పొందండి. ఈ రోజే మాకు వ్రాయండి. మీ ఇరుగుపొరుగు వారు కూడా ఈ కోర్సు చేయవచ్చును.


మా అడ్రస్

**సత్యవాణి**

**పో.బాక్స్ నెం. 80,**

**కాకినాడ. ఎ.పి.**

**533 001.**

**ఫోన్ : 0884 - 2363722**

# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

P.o. Box -80, Kakinada, A.P. 533 001
Ph : 0884 - 2363722

Editor :
**Joshua Gootam**

*Pleading for Restoration of First Century Christianity*

సంపుటి - ౩౨ | జూలై - ౨౦౧౨ | సంచిక - ౧౨


## పరిశుద్ధాత్మబాప్తిస్మము -౨
## (Baptism of the Holy Spirit)

పరిశుద్ధాత్ముని బాప్తిస్మమును గూర్చి క్రొత్త నిబంధన బోధించుచున్న కొన్ని సత్యములను గత సంచికలో మనము నేర్చు కొంటిమి. అవి పరిశుద్ధాత్మ బాప్తిస్మమును యేసుక్రీస్తు తన అపొస్తలులకే వాగ్దానము చేసెను. పెంతెకోస్తను పండుగ నాడు అపొస్తలులు మాత్రమే పరిశుద్ధాత్మలో బాప్తిస్మము పొందిరి. వారు దేవుని సత్య మును సంపూర్ణముగ ప్రకటించుటకును వారు బోధించుచున్నది దేవుని వాక్యమే యని స్థిరపరచు నిమిత్తమును పొందిరి. క్రొత్తనిబంధనలో మనకు కనబడుచున్న మొట్టమొదటి పరిశుద్ధాత్మ బాప్తిస్మము యిది. పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందిన వారి సంఘటన మరి ఇంకొక్కటి మాత్రమే క్రొత్తనిబంధనలో మనకు కన్పడుచున్నది. అది కొర్నేలి యింటివారు పొందిన సందర్భము. దానిని గూర్చి అపొ.కా. 10,11 అధ్యాయములలో వ్రాయబడి యున్నది. ఇప్పుడు ఈ రెండవ సందర్భము ను పరిశీలించుదము :

అపో.కా. 2వ అధ్యాయము నుండి 10వ అధ్యాయము వరకు మనము చదివిన యెడల సువార్త అప్పటివరకు యూదులకు మాత్రమే ప్రకటింపబడెను. 10వ అధ్యాయములో కొర్నేలీయను ఒక భక్తిపరుడు మనకు పరిచయము చేయబడుచున్నాడు. అతడు యూదుడు కాదు. అన్యుడు. అతడు తన యింటి వారందరితో కూడ దేవునియందు భయభక్తులు గలవాడై యుండి, ప్రజలకు బహుధర్మము చేయుచు ఎల్లప్పుడును దేవునికి ప్రార్ధన చేయువాడు. అతనికి దేవుని దూత ఒకడుకనబడి, “నీవు యొప్పేకు మనుష్యులను పంపి, పేతురు అను మారుపేరు గల సీమోనును పిలిపించుము. నీవును నీ యింటివారును ఏమాటల వలన రక్షణ పొందుదురో ఆమాటలు అతడు నీతో చెప్పునని” పలికెను. అతడు వెంటనే పేతురును తన యింటికి పిలిపించెను. పేతురు రాగా “ప్రభువు నీకు ఆజ్ఞాపించిన వన్నియు వినుటకై యిప్పుడు మేమందరము దేవుని యెదుట ఇక్కడ కూడి యున్నామని చెప్పెను” (అపో.కా. 10:33).

“అందుకు పేతురు నోరు తెరచి ఇట్లనెను - దేవుడు పక్షపాతి కాడని నిజముగా గ్రహించి యున్నాను. ప్రతి జనములోను ఆయనకు భయపడి నీతిగా నడుచుకొను వానిని ఆయన అంగీకరించును. యేసుక్రీస్తు అందరికి ప్రభువు. ఆయన ద్వారా దేవుడు సమాధానకరమైన సువార్తను ప్రకటించి ఇశ్రాయేలీయులకు పంపిన వర్తమానము మీరెరుగుదురు ........ అదేదనగా దేవుడు నజరేయుడైన యేసును పరిశుద్ధాత్మతోను శక్తితోను అభిషేకించెననుదియే ......... ఆయన యూదుల దేశమందును, యెరూషలేము నందును చేసిన వాటి కన్నిటికిని మేము సాక్షులము. ఆయనను వారు మ్రానున వ్రేలాడదీసి చంపిరి. దేవుడాయనను మూడవ దినమున లేపి, ఆయనతో కూడ అన్న పానములు పుచ్చుకొనిన మాకే, ఆయన ప్రత్యక్షముగా కనబడునట్లు అనుగ్రహించెను. ఇదియు గాక దేవుడు సజీవులకును, మృతులకును న్యాయాధిపతినిగా నియమించినవాడు ఈయనే యని ప్రజలకు ప్రకటించి దృఢసాక్ష్య మియ్యవలెనని మాకు ఆజ్ఞాపించెను. ఆయన యందు విశ్వాసముంచువాడెవడో వాడు ఆయన నామముమూలముగా పాపక్షమాపణ పొందునని ప్రవక్తలందరు ఆయననుగూర్చి సాక్ష్య మిచ్చుచున్నారనెను.

“పేతురు ఈమాటలు ఇంక చెప్పుచుండగా అతని బోధ విన్నవారందరి మీదికి పరిశుద్ధాత్మ దిగెను. సున్నతి పొందిన వారిలో (అనగా యూదులైన వారిలో. పేతురుతో కూడ వచ్చిన విశ్వాసులందరు పరిశుద్ధాత్మ వరము అన్యజనుల

మీద సయితము కుమ్మరింపబడుట చూచి విభ్రాంతినొందిరి. ఏలయనగా వారు భాషలతో మాటలాడుచు దేవుని ఘనపరచుచుండగా వినిరి అందుకు పేతురు - మనవలె పరిశుద్ధాత్మను పొందిన వీరు బాప్తిస్మము పొంద కుండ ఎవడైనను నీళ్ళకు ఆటంకము చేయ గలడా అని చెప్పి యేసుక్రీస్తు నామ మందు వారు బాప్తిస్మము పొందవలెనని ఆజ్ఞాపించెను" (అపో.కా. 10:34-48).

అన్యజనులైన కొర్నేలి యింటి వారిపై పరిశుద్ధాత్ముడు దిగగా, "మనుష్య లందరి మీదను నా ఆత్మను కుమ్మరిం చెదను" అని దేవుడు యోవేలు ద్వారా చేసిన ప్రవచనము సంపూర్తిగ నెరవేర్చ బడెను. పెంతెకోస్తునాడు పరిశుద్ధాత్ముడు యూదులపై దిగెను. కొర్నేలి యింటి వారిపై ఆయన అన్యజనులపై దిగెను. అన్యజనులు పరిశుద్ధాత్మ బాప్తిస్మమును పొందిన సంగతిని యెరూషలేములోని సహోదరులకు పేతురు తెలియజేయుచు "నేను మాటలాడ నారంభించినప్పుడు పరిశుద్ధాత్మ మొదట మనమీదికి దిగిన ప్రకారము వారి మీదికిని దిగెను. అప్పుడు యోహాను నీళ్ళతో బాప్తిస్మ మిచ్చెను గాని మీరు పరిశుద్ధాత్మలో బాప్తిస్మము పొందుదురని ప్రభువు చెప్పిన మాట జ్ఞాపకము చేసికొంటిని" యని అతడు చెప్పెను (అపో.కా. 11:15-16).

కొర్నేలి యింటివారు అపొస్తలులవలెనే పరిశుద్ధాత్మ బాప్తిస్మమును పొందిరి యని పేతురు ఇక్కడ చెప్పెను.

కొర్నేలి యింటివారు పరిశుద్ధాత్మ బాప్తిస్మమును ఎందునిమిత్త పొందిరి ? యేసుక్రీస్తుద్వారా అన్యజనులును యూదు లవలె దేవునికి అంగీకారయోగ్యులే యని నిరూపించుట కొరకు, దేవుని దృష్టిలో అందరు సమానులే యని నిరూపించుట కొరకు, వారు పరిశుద్ధాత్మ బాప్తిస్మమును పొందిరి. అందుకే అపో.కా. 11 : 17లో పేతురు, "కాబట్టి ప్రభువైన యేసుక్రీస్తునందు విశ్వాసముంచిన మనకు అనుగ్రహించినట్టు దేవుడు వారికికూడ సమానవరము అనుగ్రహించి యుండగా దేవుని అడ్డగిం చుటకు నేనేపాటివాడను?" అని యెరూష లేములోని సహోదరులకు చెప్పగా "వారు ఈ మాటలు విని మరే మియు అడ్డము చెప్పక - అట్టయితే అన్యజనులకును దేవుడు జీవార్థమైన మారుమనస్సు దయ చేసి యున్నాడని చెప్పుకొనుచు దేవుని మహిమపరచిరి" (అపో.కా. 11:18).

తరువాత మనము గమనించ వలసిన సంగతి మరొకటి ఏమంటే - కొర్నేలి యింటివారు, రక్షింపబడు నిమిత్తము పరిశుద్ధాత్మ బాప్తిస్మమును పొందలేదు. ఏలయనగా అపో.కా. 11:14 లో "నీవును నీయింటి వారును ఏమాటలవలన రక్షణ పొందుదురో

ఆమాటలు అతడు (అనగా పేతురు) నీతో చెప్పునని" దేవుని దూత యొకడు కొర్నేలికి తెలియజేసెను. పేతురు వచ్చి కొర్నేలి యింటివారికి క్రీస్తు సువార్తను బోధించెను. క్రీస్తుసువార్త నమ్ము ప్రతివానిని రక్షించుటకు దేవుని శక్తియై యున్నదని, రోమా 1:16 చెప్పుచున్నది. పేతురు సువార్తను బోధించగా కొర్నేలి యింటివారు వినిరి. వారిపై పరిశుద్ధాత్ముడు దిగినను వారు యేసుక్రీస్తు నామ మందు బాప్తిస్మము పొందవలెనని పేతురు వారిని ఆజ్ఞాపించెను. ఎందువలన? "నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును" అని యేసుక్రీస్తు చెప్పినందు వలన. గనుక మిత్రులారా, మనము గమనించవలసినది ఏమంటే ఈనాడు ఎవరైనను రక్షింపబడవలెనంటే వారు పొంద వలసినది నీటి బాప్తిస్మమేగాని పరిశుద్ధాత్మ బాప్తిస్మము కాదు. పరిశుద్ధాత్మ బాప్తిస్మము కేవలము రెండే రెండు సందర్భములలో జరిగెను. వాటిని గూర్చి మనము గత రెండు పాఠములలో తెలిసికొని యుంటిమి. పరిశుద్ధాత్మ బాప్తిస్మము క్రీస్తు చేసిన వాగ్దానము. దానిని ఆయన నెరవేర్చెను.

ఈ రెండు సందర్భములలో తప్ప మరింకెక్కడను, మరెవరైనను పరిశుద్ధాత్మ బాప్తిస్మమును పొందినట్లు మనము క్రొత్త నిబంధనలో చదువలేము. నేటికింకను పరిశుద్ధాత్మ బాప్తిస్మము ఉన్నదని బోధించువారు, 'అంత్యదినములయందు నేను మనుష్యులందరి మీదను నా ఆత్మను కుమ్మరించెదను' అని యోవేలు ద్వారా చెప్పబడిన ప్రవచనమును సూచింతురు. అయితే పెంతెకోస్తునాడు పేతురు ప్రసంగించుచు యోవేలు ప్రవక్త ద్వారా చెప్పబడిన ఆ సంగతి యిదే అని బోధించెను. ఇంకొక మాటలో యోవేలు చేసిన ప్రవచనము పెంతె కోస్తునాడు నెరవేర్చబడెను అని పేతురు సూచించెను. కొర్నేలి యింటివారు అన్యజనులైనను పరిశుద్ధాత్మ బాప్తిస్మమును పొందగా ఆ ప్రవచనము మరింత సంపూర్తిగ నెరవేర్చబడెను. ఒకసారి నెరవేర్చబడిన ప్రవచనము ఎల్లప్పుడు నెరవేర్చబడుచూ ఎట్లుండగలదు?

అపొస్తలులును కొర్నేలి యింటివారును పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందిన కొన్ని సంవత్సరముల తరువాత ఇప్పుడు ఒకేఒక్క బాప్తిస్మము ఉన్నదని అపొ.పౌలు వ్రాసెను. "ప్రభువు ఒక్కడే, విశ్వాస మొక్కటే, బాప్తిస్మ మొక్కటే, అందరికి తండ్రియైన దేవుడు ఒక్కడే " యని ఎఫెసీ 4:5లో అతడు వ్రాసెను. ఇప్పుడు అమలులో యున్న ఒక్కటే బాప్తిస్మము యేసుక్రీస్తు ఆజ్ఞాపించిన నీటి బాప్తిస్మము.

ఆయన పరమున కెక్కిపోవక ముందు తన అపొస్తలులకిట్లు ఆజ్ఞాపించెను : "కాబట్టి మీరు వెళ్ళి సమస్తజ

నులను శిష్యులనుగా చేయుడి; తండ్రి యొక్కయు, కుమారుని యొక్కయు, పరిశుద్ధాత్మ యొక్కయు నామములోనికి వారికి బాప్తిస్మమిచ్చుచు నేను ఏయే సంగతులను ఆజ్ఞాపించితినో వాటి నన్నిటిని గైకొన వలెనని వారికి బోధించుడి" (మత్తయి 28:19, 20). మిత్రుడా, నీవు యేసుక్రీస్తు ఆజ్ఞాపించిన నీటిబాప్తిస్మమును పొందితివా? లేని యెడల ఈరోజే ఆయన యందు విశ్వాసముంచి ఆయన ఆజ్ఞలకు లోబడుము.

## సహవాసము నుండి తొలగించుట
## (Withdrawing from Fellowship)

సంఘ సహవాసము నుండి తొలగించుటను గూర్చి పెక్కుమంది మాట్లాడురు. ఈ అంశమును గూర్చి బైబిలు బోదించుచున్నది. గాని దానిని గూర్చి సూటిగా చెప్పేలేఖన భాగములు కొన్ని మాత్రమే యున్నాయి. నిజానికి క్రొత్తనిబంధనలో నాలుగు లేఖన భాగములు ఈ అంశమును ఉపదేశించుచున్నాయి. వాటిని ఒక్కొక్క దానిని పరిశీలింతము.

అక్రమముగా నడుచుకొను వారిని తొలగించాలి :

అపో.పౌలు ఇట్లు చెప్పుచున్నాడు: "జారులతో సాంగత్యము చేయవద్దని నా పత్రికలో మీకు వ్రాసియుంటిని. అయితే ఈ లోకపు జారులతోనైనను లోభులతో నైనను దోచుకొను వారితో నైనను ఏమాత్రమును సాంగత్యము చేయవద్దని కాదు; అలాగైతే మీరు లోకములో నుండి వెళ్లిపోవలసి వచ్చును గదా? ఇప్పుడైతే సహోదరుడనబడిన వాడు ఎవడైనను జారుడుగాని, లోభిగాని విగ్రహారాధకుడుగాని, తిటుబోతుగాని, త్రాగుబోతుగాని దోచుకొనువాడు గాని అయియున్న యెడల అట్టివానితో సాంగత్యము చేయకూడదు, భుజింపను కూడదని మీకు వ్రాయుచున్నాను. వెలుపలివారికి దేవుడే తీర్పుతీర్చును. మీరు లోపటి వారికి తీర్పుతీర్చువారు. గనుక ఆదుర్మార్గుని మీలోనుండి వెలివేయుడి" (1కొరింధీ 5:9-13).

పైలేఖనభాగము ఆరు రకములైన దుర్మార్గతను గూర్చి చెప్పుచున్నది. అట్టి అక్రమ క్రియలు చేయువారిని సహవాసము నుండి బహిష్కరించాలని అది చెప్పుచున్నది. వాటిని దిగువ పరిశీలింతము:

**జారత్వము :**

యిది అక్రమలైగింక సంబంధము లన్నిటిని వివరించుటకు వాడబడిన పదము. సంఘ సభ్యుడెవడైనా యిట్టి అక్రమసంబంధము కలిగియుంటే సంఘము వెంటనే వానిని బహిష్కరించును.

**లోభత్వము :**

ఎవడైనను లోభియై యున్నందున వెలివేయబడుటను గూర్చి మనం ఎన్నడు విని యుండలేదు. లోభత్వము విగ్రహారాధనతో సమానమైనది. "కావున భూమి మీదనున్న మీ అవయవములను అనగా జారత్వమును అపవిత్రతను కామాతురతను దురాశను విగ్రహారాధనయైన ధనాపేక్షను (లోభత్వమును) చంపివేయుడి యని" అపొ. పౌలు చెప్పుచున్నాడు (కొలస్స 3:5).

**విగ్రహారాధన :**

యిది ఆత్మీయ విషయాల్లో నమ్మకత్వము లేని వారిని సూచించును. ధనాపేక్ష విగ్రహారాధనయే. నిజానికి సంఘసభ్యుడెవడైనను విగ్రహాలకు మ్రొక్కితే మనం సహించము. మొదట్లో అన్య జనులు అట్లు చేసేవారు. అయినను ధనాపేక్షగల వాడు ధనాన్ని ఆరాధించును.

**తిట్టుబోతు :**

యిది అసభ్యకరమైన భాషను, బూతులాడుటను సూచించును. సంఘ సభ్యుడు బూతులాడుచున్నందున బహిష్కరింపబడుటను గూర్చి మనము ఎన్నడు వినము. అయినను కొందరు నోరు విప్పితే బూతులాడుదురు బూతులాడు నాలుక మరణకరమైన పరికరము. యిట్టివారి వలన సంఘము దెబ్బతినును. అట్టివారి విషయంలో సంఘ పెద్దలు తగుచర్యలు గైకొనాలి. లేనియెడల సంఘము ముక్కలగును.

**త్రాగుబోతు :**

జారత్వము వలె, త్రాగుబోతులపై సంఘము త్వరితంగా చర్యగైకొంటాది. త్రాగుబోతులను సంఘములో సహించరాదు. త్రాగుబోతులు సాధారణంగా బయటపడిపోతారు, మిగతా పాపములు అంత త్వరగా పైకి తేలవు.

**దోచుకొనువాడు :**

సంఘములో బలవంతముగా డబ్బులు వసూలుచేసే వారిని గూర్చి మనం సాధారణంగా వినము. యిది ధనాపేక్షతో సమానము. యిట్టివారిని సంఘము సహించదు.

ఇట్టి పాపములు చేయువారిని గూర్చి పౌలు చాల శక్తివంతమైన మాటలు వినియోగించాడు. అట్టి వానిని సాతానుకు అప్పగించుడి, పాత పులిపిండిని తీసివేయుడి, జారులతో సాంగత్యము చేయవద్దు, ఆ దుర్మార్గుని మీలో నుండి వెలివేయుడి యని అతడు

హెచ్చరించాడు (1 కొరింథీ 5:1-13; 2 కొరింథీ 2:1-11).

సంఘపెద్దలు అధికారపూర్వకముగా అట్టివారిని బహిష్కరించినను, ఆయా వ్యక్తులు సంఘకూటములకు, ఆరాధనలకు హాజరైన సందర్భాలు నాకు తెలుసు. ఇట్టి సందర్భాల్లో ఒకటి రెండు తప్పులు జరిగియుండ వచ్చును. మొదటిగా పెద్దలు అతని వెలిని గూర్చి బహుశ తొందరపడి యుండవచ్చును. లేదా వారి చర్యను సంఘమునకు వారు తగు రీతిగ తెలియజేసి యుండకపోవచ్చును.

ఒక సహోదరుడు వెలివేయబడిన యెడల సభ్యులందరు అట్టివానితో సాంగత్యము చేయకూడదు. అతడు చేసిన దోషమును గూర్చి మారు మనస్సు పొందునట్లు యిది సహాయపడును. అతడు మారు మనస్సు పొంది ప్రభువు మందలో తిరిగి చేరునట్లు యిది సహాయపడును.

ఎవనినైనా వెలివేయకముందు అతని జీవితంలో మార్పు తెచ్చుటకు గాను సంఘపెద్దలు, బోధకుడు, సభ్యులు శాయుశక్తులా ప్రయత్నించవలెను. ఓర్పుతో తాము చేయు ప్రయత్నములన్నిటిని గూర్చి సంఘమంతా ఎరిగియుండవలెను.

**భిన్నమైన బోధను చేయువారిని బహిష్కరించాలి:**

"ఎవడైనను మన ప్రభువైన యేసుక్రీస్తు యొక్క హితవాక్యములను, దైవభక్తికి అనుగుణ్యమైన బోధను అంగీకరింపక భిన్నమైన బోధను ఉపదేశించినయెడల వాడేమియు ఎరుగక తర్కములను గూర్చియు, వాగ్వాదములను గూర్చియు వ్యర్థముగా ప్రయాసపడుచు గర్వాంధుడగును. వీటిమూలముగా అసూయ, కలహము దూషణలు దురనుమానములును చెడిపోయిన మనస్సు కలిగి సత్యహీనులై దైవభక్తి లాభసాధనమను కొను మనుష్యుల వ్యర్థ వివాదములును కలుగుచున్నవి" యని పౌలు వ్రాసాడు (1 తిమోతి 6:3-5).

ఎవడైనను మన ప్రభువైన యేసుక్రీస్తు యొ ...హితవాక్యములను ....... అంగీకరింపక భిన్నమైన బోధ ఉపదేశించిన యెడల అనుమాటలు పౌలు థెస్సలోనికయలో యున్న సంఘానికి చెప్పిన దానికి సమానముగా యున్నది. "సహోదరులారా, మా వలన పొందిన బోధన ప్రకారము కాక అక్రమముగా నడుచుకొను ప్రతి సహోదరుని యొద్ద నుండి తొలగిపోవలెనని మన ప్రభువైన యేసు క్రీస్తు పేరట మీకు ఆజ్ఞాపించుచున్నానని" అతడు వ్రాసాడు (2 థెస్స 3:1). పరిశుద్ధాత్మావేశముచే వ్రాయబడిన మాటలకు సహోదరులు కట్టుబడియుండుట అత్యవసరము. దైవిక ప్రమాణము నుండి తొలగిపోవు వారంద

రినీ పౌలు ఖండించుచున్నాడు.

అట్టివాడు వ్యర్థముగా ప్రయాస పడుచు, ఏమియు ఎరుగక తర్కించును. వాగ్వాదములు పెట్టుకొనును. ఇట్టి వారిని మనందరం చూచేయుంటాము. వారు ప్రతి సంఘములోను యుంటారు. వారిని గుర్తించుట యేమీ కష్టముకాదు. అట్టివారి ప్రవర్తనవలన కలహము, అసూయ, దూషణలు, దురనుమానములు కలుగును. చెడిపోయిన మనస్సు కలిగి సత్యహీనులైన వారి వలన వ్యర్థ వివాదములు కలుగుచున్నవి. అట్టివారి నుండి తొలగి పోవాలని పౌలు హెచ్చరించాడు.

**క్రొత్తబోధను బోధించువారి నుండి తొలగి పోవాలి :**

"ఎవడైనను ఈ బోధను తేక మీ యొద్దకు వచ్చిన యెడల వానిని మీ యింట చేర్చుకొనవద్దు : శుభమని వానితో చెప్పవద్దు; శుభమని వానితో చెప్పువాడు వాని దుష్ట క్రియలలో పాలివాడగును" (2 యోహాను : 10-11).

ఇక్కడ యోహాను చెప్పిన పాపము, 2 థెస్స 3:6లోను 1 తిమోతి 6:3-5 లోను పౌలు చెప్పినదే. తొలగిపోయిన సహోదరుని గూర్చి యోహాను ఇక్కడ చెప్పకపోయినను, అతని భాష అట్టివానినే సూచించుచున్నది. ఎవడైనా సహోదరుడు సత్యము నుండి తొలగిపోయి ఏదైనా క్రొత్త బోధను బోధించుచున్న యెడల అట్టివానిని చేర్చుకొన కూడదు, శుభమని అతనికి చెప్పకూడదు. అట్టివానితో ఏరకమైన సహవాసము కలిగియుండకూడదు. అట్టివానిపై చర్య తీసికొనకముందు పెద్దలు అతని పిలిపించి, వానితో మాట్లాడి అతని సరిచేయుటకు ప్రయత్నించాలి. వైద్యుడు రోగి యొక్క ప్రాణమును రక్షించుటకు ఎట్లు ప్రయత్నించునో అట్లే పెద్దలు కూడ అతని ఆత్మను రక్షించుటకు ప్రయత్నిం చాలి.

పెద్దలు వారితో మాట్లాడినందున రక్షింపబడినవారి సందర్భములు మనకు తెలుసు. ఒక వేళ క్రొత్తబోధ బోధించు వానిని వెలివేయవలసి వస్తే ముందుగా ఆ సంగతి సంఘమునకంతా తెలియ జేయాలి. బహిష్కరింపబడిన వానిని హేళన చేయరాదు.

వెలివేయబడిన వారు తిరిగి సహవాసములో చేరునట్లు వారి కొరకు ఎల్లవేళలా ద్వారము తెరిచియుంచాలి. కొరింథులోని సంఘముకు పౌలు వ్రాసిన రెండవ పత్రికలో ఈ సంగతి విపులీకరించాడు. అట్టివాడు మారు మనస్సు పొందినప్పుడు "మీరిక వానిని శిక్షింపక క్షమించి ఆదరించుట మంచిది. లేనియెడల ఒక వేళ వాడు అత్యధికమైన దుఃఖములో మునిపోవును" అని అతడు చెప్పాడు (2 కొరింథి 2:7). ఎవనినైనా వెలివేస్తే అది అతని మేలుకొరకే ముఖ్య

ముగా ఉద్దేశించబడినది. తద్వారా అతడు తన ప్రవర్తన విషయమై పరివర్తన జెంది సంఘమునకు తిరిగి చేరుకొనును.

దుర్మార్గులను వెలివేయుట వలన సంఘముపై వారి ప్రభావము ఉండకుండ పోవును. వెలివేయబడినవాడు తన ప్రవర్తన మార్చుకొంటే అతని తిరిగి చేర్చుకొనుటకు సంఘమంతా ఆసక్తికను బరచాలి. తిరిగి చేర్చుకొనబడిన వారిని సహోదరులవలె అందరు పరిగణించాలి. కోపబుద్ధి వలన, పగ వలన మనం యేమీ సాధించలేము.

సహోదరులందరు ఈ సూత్రములను చదవాలి. క్రీస్తు ఆత్మతో వాటిని పాటించాలి. అప్పుడు వారి క్రమశిక్షణ చర్యలు ఫలితాలను సాధిస్తాయి.

– ఎల్.ఆర్. విల్సన్

## శారా, జనాంగములకు తల్లి
## (Sarah, Mother of Nations)

క్రీస్తుకు రెండువేల సంవత్సరముల పూర్వము కల్దీయుల ఊరు అను పట్టణములో అబ్రాహాము, శారా దంపతులు నివసించిరి. ఊరు అను పట్టణము గుడారములలో నివసించు సామాన్య ప్రజలతోగాక, అనేక భవనములు, కాలువలు, పాఠశాలలు, గణితములో నైపుణ్యత, శాసన సంబంధ పరిజ్ఞానము, లేఖకులు, నిఘంటవులు, మత సంబంధ కళలతో నిండియుండెను. గృహములలో యజమానులకు, పని వారికి అనేక గదులుండేవి. ఇండ్లలోనికి నీరు సరఫరా చేయబడేది. ఊరులో అనేక ఆధునిక సదుపాయములుండేవి.

అబ్రహాము చుట్టు యున్న ప్రజలు విగ్రహారాధనలో మునిగియుండగా, అతడనేక జనాంగములకు తండ్రిగా యుండుటకు దేవుడతనిని ఎంచుకొనెను. అందువలన అతడున్న ఊరును విడిచి తాను చూపించబోవు దేశమునకు వెళ్ళుమని దేవుడతని ఆజ్ఞాపించెను. తన బంధువులను మిత్రులను విడిచి దేవుడు చూపించబోవు వేరొక దేశమునకు వెళ్ళుమని దేవుడు తనతో చెప్పిన మాటలను అబ్రాహాము తన భార్యయైన శారాకు తెలియజెప్పెను. మనమెక్కడికి వెళ్లుచున్నామని శారా అడుగగా, నాకు తెలియదు, దేవుడు నాకు చెప్పలేదని అతడనెను. ఇట్టి మాటలు నీ భర్త నీతో చెబితే ఎట్లు స్వీకరిస్తావు? అదేనేటి ఆధునిక స్త్రీలయితే, "అబ్రాహాము, నేను ఎక్కడికీ వెళ్లను! మనకిక్కడ మంచి యిల్లు వున్నది. బంధువులు, మిత్రులు అందరూ ఇక్కడే వున్నారు. దీనినంతటిని విడిచి రాలేను.

సరిగదా ఎక్కడికి వెళ్ళుచున్నామో కూడ నీకు తెలియదు. నీతో ఒక గుడారములో ఎక్కడో నేను వుండాలని నీవు కోరు కొనుచున్నావు. కావలిస్తే నీ సామానుతో నీవే వెళ్లు; నేనయితే ఎక్కడికీ కదలను; ఇదంతా విడిచి నేను రాలేనని" చెప్పు దురు.

అయితే దేవుడే వారిని సంరక్షి స్తాడని శారాకు తెలుసు. అందువలన ఆమె అతనితో వెళ్లుటకు నిశ్చయించు కొన్నది (ఆదికా. 12 అధ్యా). ఆమె యొక్క విశ్వాసము గొప్పది. దేవుడు తన వాగ్దానమును నెరవేర్చి వారిని సంరక్షి స్తారని ఆమె ఎరుగును. "విశ్వాసమును బట్టి శా రాయు వాగ్దానము చేసినవాడు నమ్మదగిన వాడని యెంచుకొనెను గనుక తాను వయస్సు గతించినదైనను గర్భము ధరించుటకు శక్తి పొందెను" అని హెబ్రీ 11:11 చెప్పుచున్నది.

అబ్రాహాము, శారాలు కల్దీయుల ఊరు అను పట్టణమును విడిచి పదేళ్లు గడిచిపోయెను. వారు కానాను దేశమంత యు సంచారము చేసిరి గాని దేవుడు వాగ్దానము చేసినట్లు దానిని స్వతంత్రించు కొనలేదు. సరిగదా నిన్ను గొప్ప జనాం గముగా చేయుదునను వాగ్దానము నెరవేరునట్లు శారా ఇంకా గర్భవతి కాలేదు. అబ్రాహాము యొక్క స్వంత కుమారుని ద్వారానే ఈ జనాంగము కలుగునని దేవుడు అబ్రాహాముకు వాగ్దానము చేసెను (అది.కా. 15:4). అయినా ఇంకా ఆ శిశువు కలుగలేదు. బహుశ శారా ఓరిమి కోల్పోవుచుండెను. బహుశ ఆమె విశ్వాసము సన్నగిల్లుట కారంభించెను. బహుశ దేవుడు అబ్రా హాముకు చేసిన వాగ్దానములో తాను లేదేమో? అందువలననే మనకు తెలియని రీతిగా దేవునికే శారా సహాయము చేయుటకు సంకల్పించెను !

శారా తన దాసియైన హాగరును అబ్రాహాముకు రెండవ భార్యగా అను గ్రహించెను. ఆమెద్వారా అబ్రాహాముకు సంతానము కలుగునేమోయని ఆమె తలంచెను. వారిచుట్టు యున్న జనాం గములు ఇట్లు చేయుట వాడుక. సంతానము కలిగియుండుట ప్రాము ఖ్యము, గౌరవము. భార్య గొడ్రాలయితే, సంతానోత్పత్తి కొరకు రెండవ భార్య ఉపయోగపడేది. దురదృష్టవశాత్తు అబ్రాహాము శారా యొక్క సలహాను మన్నించి, హాగరును స్వీకరించెను. ఆమె గర్భవతియాయెను.

దాసియైన స్త్రీ తన యజమాను రాలి యొక్క ఆస్థి. ఆమెయు, ఆమె శ్రమఫలమును, ఆమె పిల్లలును యజ మానురాలి యొక్క ఆస్థిగా పరిగణిం పబడేది. దాసికి పుట్టిన పిల్లలు యజ మానురాలి యొక్క బిడ్డలు. ఈ షరతు

మీదనే హాగరును అబ్రాహాముకు శారా అనుగ్రహించెను. బహుభార్యతత్వపు సంగతులన్నిటిలోను కూడ ఇట్టి సందర్భములలో ఘర్షణ తప్పక ఉద్భవించునని ఆడమ్‌క్లార్క్ అను ప్రసిద్ధ వ్యాఖ్యాన కర్త చెప్పెను.

అబ్రాహాము వలన హాగరు గర్భవతి కాగా, ఆమె ఒక దాసియని మరచి, శారాను ద్వేషించెను. హాగరు ప్రవర్తనను బట్టి శారా అబ్రాహామును నిందించెను. ఇద్దరిలో ఎవరినో ఒకరినే ఎంచుకోవలెనని అతనికి చెప్పెను. తన భర్త యొక్క ప్రేమను కోల్పోయెనని, గొడ్రాలయినందున తన దాసి యొద్ద న్యూనత భావములు శారా కలిగి యుండెనని కొందరు వ్యాఖ్యాన కర్తలు చెబుతారు. అయితే హాగరు విషయములో తన యిష్టము వచ్చినట్లు చేయుమని అబ్రాహాము ఆమెకు సెలవిచ్చెను. శారా హాగరును హింసించగా, ఆమె పారిపోయెను. అయితే దేవుడు అరణ్యములో ఒక నీటిబుగ్గ దగ్గర హాగరుతో మాటలాడెను. ఆమె శారా దగ్గరకు తిరిగివెళ్లి ఆమెకు లోబడి యుండవలెనని దేవుడామెతో చెప్పెను. తన కుమారుడు కూడ ఒక గొప్ప జనాంగమగునని, అతడు తన చుట్టుయున్న వారితో ఎల్లప్పుడు పోరాడుచు యుండునని దేవుడామెకు చెప్పెను. దేవుని మాటచొప్పున హాగరు శారా దగ్గరకు తిరిగి వెళ్లెను. అనేక సంవత్సరముల తరువాత ఇస్సాకు జన్మించిన పిదప ఆ అసూయలు, కష్టములు మరల ఉద్భవించెను. ఈసారి హాగరును, ఇష్మాయేలును అబ్రాహాము పంపించి వేసెను (ఆది.కా.21:9-13).

దేవుని వాగ్దానమును త్వరగా నెరవేర్చుకోవాలని చేసిన ఈ ఒక్కక్రియయే చెప్పలేనంత కీడుగా మారెను. శారా చేసిన తొందరపాటు నిర్ణయము యొక్క పర్యవసానమును నేటికిని ఈ లోకము అనుభవింపవలసి వచ్చినది. అరబీయ జనాంగములు అబ్రాహాముకు హాగరు వలన కలిగిన వారే. దేవుడు మన కాలక్రమము చొప్పున గాక ఆయనే కాలక్రమము చొప్పుననే నడుచుకొనునని మనం జ్ఞాపకముంచుకోవాలి.

**ఆదికాండము 18**

ఒకనాడు అబ్రాహాము ముగ్గురు పురుషులు తన యొద్దకు వచ్చుట చూచెను. వారిని స్వాగతించుటకు అతడు పరుగెత్తికొని వెళ్లెను. చెట్టుల నీడను వారికి విశ్రాంతినను గ్రహించెను. వారు కాళ్లు కడుగుకొనుటకు నీరును, భుజించుటకు ఆహారమును అతడు వారికి సిద్ధపరచెను. వారు దానిని స్వీకరించగా అబ్రాహాము గుడారములో యున్న శారా యొద్దకు త్వరగా వెళ్లి వారికి రొట్టెలు చేయుమని చెప్పెను. వారి కొరకు ఒక మంచి లేగదూడను వధించెను. వారికి మంచి భోజనము నేర్పాటు చేసెను. వారు

భోజనము చేయుచుండగా అబ్రాహాము వారి యెదుట నిలిచెను. దేవుడు అబ్రాహాము, శారాలకు చేసిన వాగ్దానమును జ్ఞాపకము చేయుటకు ఈ మనుష్యులు వారి యొద్దకు వచ్చిరి. ఒక సంవత్సరము నాటికి వాగ్దానము చేయబడిన రీతిగనే శారా ఒక కుమారుని కనెను. అతడే ఇస్సాకు.

**అదికాండము 12:10 -20; ఆదికాండము 20 :**

కానాను దేశములో కరువు సంభవించినందున అబ్రాహాము ఐగుప్తుకు ప్రయాణమై వెళ్లెను. 65 సంవత్సరముల వయస్సు గలదైనను శారా రూపవతియై యుండెను. ఆమె యొక్క సౌందర్యము వలన ఫరో శారాను తన భార్యగా చేసికొనునేమోయని అబ్రాహాము తలంచెను. వారిద్దరు భార్యభర్తలని ఐగుప్తీయులకు తెలిస్తే వారు అబ్రాహామును చంపుదురు శారాను తీసికొని పోవుదురు. అందువలన వారు ఐగుప్తు సమీపించుచుండగా ఆమె అబ్రహాము యొక్క సహోదరి అని చెప్పుమని అతడామెను ప్రోత్సహించెను. నిజానికి వరుసకు వారిద్దరు సోదర, సోదరీలే. వారిద్దరు తల్లుల వేర్వేరుగాని తండ్రి ఒక్కడే. అబ్రాహాము చెప్పినట్లే శారా చేసెను. అబ్రాహాము తలంచినట్లే ఐగుప్తీయులు శారా యొక్క సౌందర్యమును బట్టి ఆమెను తీసికొనిపోయిరి. శారా కొరకు ఫరో అబ్రాహాముకు విస్తారమైన కట్నము నిచ్చెను. అయితే ఫరోశారాను తన భార్యగా స్వీకరించక మునుపు దేవుడు ఫరోకును అతని యింటి మీదికిని గొప్ప రోగములు కలుగజేసెను. నిజానికి శారా అబ్రాహాము యొక్క భార్యయని అతడు తెలిసికొని అబ్రాహామును తన మోసము నిమిత్తము గద్దించి, వారిద్దరిని పంపి వేసెను.

ఇరువది నాలుగు సంవత్సరముల తరువాత అబ్రాహాము యొక్క ప్రాణ భయము వలన వారిద్దరు ఇదేరీతిగా ఇంకొక రాజును మోసగింప యత్నించిరి. అయితే దేవుడు శారా అబ్రాహాము యొక్క భార్యయని, ఆమెను ముట్టవద్దని అబీమెలెకు రాజుకు స్వప్నము ద్వారా తెలియజేసెను. తత్ఫలితముగా అబీమెలెకు అబ్రాహామును గద్దించెను. ఈసారి అబ్రాహాము సాకులు చెప్పుట కారంభించెను. దేవుడు తమను ఊరను పట్టణము నుండి వెలుపలికి రమ్మనిన నాటినుండి వారిద్దరు సోదర సోదరీలనే చెప్పుకొనుటకు నిశ్చయించిరని, ప్రాణ భయమును బట్టి వారట్లు చేసితిరని అబ్రాహాము అబీమెలెకుకు తెలియజేసెను. అబీమెలెకు శారాను అబ్రాహాముకు తిరిగి యిచ్చి అతనికి దాస దాసీలను, పనివారిని, వెండిని బహుమతిగా యిచ్చెను. ఆ దేశములో అబ్రాహాము

తనకిష్టము వచ్చిన చోట బ్రదుకవచ్చని అబీమెలెకు సెలవిచ్చెను.

**నేర్చుకొన దగిన సూత్రములు**

**శారా యొక్క విశ్వాసముగొప్పది :**

శారా యొక్క విశ్వాసము ఆమెను తన బంధుమిత్రుల దగ్గర నుండి వేరొక చోటుకు కొనిపోయినది. గర్భము దాల్చు వయస్సు గతించిపోయినను విశ్వాసమును బట్టి ఆమె ఇస్సాకునుకనెను. తన విశ్వాసము వలన ఆమె జనాంగములకు తల్లి ఆయెను (ఆది.కా 17:16).

"విశ్వాసమనునది నిరీక్షింపబడు వాటియొక్క నిజస్వరూపమును అదృశ్యమైనవి యున్నవనుటకు రుజువునై యున్నది. దానిని బట్టియే పెద్దలు సాక్ష్యము పొందిరి. ప్రపంచములు దేవుని వాక్యము వలన నిర్మాణమైన వనియు అందును బట్టి దృశ్యమైనది కనబడెడు పదార్థములచే నిర్మింపబడలేదనియు విశ్వాసముచేత గ్రహించుకొనుచున్నాము" (హెబ్రీ 11:1-3).

దేనినైనా మనము చూడకపోయినను, అది ఉన్నదని నమ్ముటకు విశ్వాసము సహాయపడును. గాలిని మనము చూడలేము. అయితే ఆకులు కదులుచున్నాయి, చెట్లు ఊగుచున్నాయి, గాలి వీచుచున్నది. గాలియొక్క పర్యవసానము చూచుచున్నాము గనుక గాలి యున్నదని మనము నమ్ముదుము. ఈలోకాన్ని దేవుడు సృజించుట మనము చూడకపోయినను, ఆయనే ఈ లోకానికి సృష్టికర్త యని మనము నమ్ముదుము. సృష్టి యొక్క ఫలితాలను మనము చూచుచున్నాము. దిగువ వచనములను గమనించుము. "వెలిచూపు వలనే గాక విశ్వాసము వలననే నడుచుకొనుచున్నాము" (2 కొరింథీ 5:6). దేవుని మనము చూచుచున్నందున వలన గాక, విశ్వాసమును బట్టి ఆయన లేఖ నముల ద్వారా ఆయన యందు విశ్వాసముంచుచున్నాము.

"దేవుని యెదుట యోగ్యునిగాను సిగ్గుపడనక్కరలేని పనివానిగాను, సత్యవాక్యమును సరిగా ఉపదేశించువానిగాను నిన్ను నీవు దేవునికి కనుపరచుకొనుటకు జాగ్రత్త పడుము" (2 తిమోతి 2:15). దేవుని వాక్యమును శ్రద్ధగా చదివిన యెడల మన విశ్వాసము బలపడును.

"విశ్వాసము లేకుండ దేవునికి ఇష్టుడై యుండుట అసాధ్యము; దేవుని యొద్దకు వచ్చువాడు ఆయన యున్నాడనియు తన్ను వెదకు వారికి ఫలము దయచేయువాడనియు నమ్మవలెను" (హెబ్రీ 11:6). మన రక్షణకు ముందు విశ్వాసమవుసరము. అది దేవునియందలి మన భక్తిని కొనసాగించును.

"యేసేక్రీస్తయి యున్నాడని నమ్ము ప్రతివాడును దేవుని మూలముగా పుట్టి యున్నాడు. పుట్టిన వానిని ప్రేమించు ప్రతి

వాడును ఆయనమూలముగా పుట్టిన వానిని ప్రేమించును. మనము దేవుని ప్రేమించుచు ఆయన ఆజ్ఞలను నెరవేర్చు వారమైతిమా దేవుని పిల్లలను ప్రేమించు చున్నామని దానివలననే యెరుగుదుము. మనమాయన ఆజ్ఞలను గైకొనుటయే దేవుని ప్రేమించుట; ఆయన ఆజ్ఞలు భారమైనవి కావు. దేవుని మూలముగా పుట్టిన వారందరును లోకమును జయించు దురు. లోకమును జయించిన విజయము మన విశ్వాసమే. యేసు దేవుని కుమారు డని నమ్మువాడు తప్ప లోకమును జయిం చువాడు మరి ఎవడు?" (1 యోహాను 5 :1-5).

శారా యొక్క విశ్వాసము అనేక మారులు పరీక్షింపబడెను. కొన్నిసార్లు ఆమె విశ్వాసము బలపడెను, మరికొన్ని సార్లు ఆమె తడబడెను. శారావలె నేటి క్రైస్తవులు కూడ యున్నారు. కొన్ని సార్లు వారు నిలబడుదురు, మరికొన్ని సార్లు తడ బడుదురు. మనం తడబడినప్పుడు దేవునినడిగితే ఆయన తప్పక క్షమించును. శారా లాంటి విశ్వాసము నీకున్నదా? దేవుని సేవించుటకు శారావలె సమస్త మును పరిత్యజించుటకు ఇష్టపడుదువా!

**శారా ఓరిమి లేనిదాయెను :**

దేవుడు అబ్రాహాముకు చేసిన వాగ్దానము నెరవేరు వరకు శారా ఓరిమి లేనిదాయెను. బహుశ దేవుని వాగ్దానము లో తాను ఇమడ్చబడలేదను కొన్నదేమో. శారా తన స్వంత నిర్ణయము చొప్పున తన దాసీయైన హాగరును అబ్రాహాముకు అనుగ్రహించెను. హాగరు గర్భవతియై అబ్రాహాము వలన ఇష్మాయేలును కనెను. ఇంచుమించు 15 సంవత్సరముల తరువాత దేవుడు అబ్రాహాముకు చేసిన వాగ్దానము నెరవేర్చబడెను. శారా గర్భవతియై ఇస్సాకును కనెను. శారా యొక్క పొరబాటువలన ఈలోకము నేటివరకును హింస ఎదుర్కొనుచున్నది.

నీవు శారావలె యున్నావా? కొన్నిసార్లు దేవుని దగ్గర నీ ఓరిమిని కోల్పోవుచున్నావా? నీ ప్రార్థనలకు జవాబు ఆలస్యమైనందున దేవుని శక్తిని శంకించుచున్నావా? దేవుని కాలమాన ము మన కాలమానమును బట్టి యుండ దని జ్ఞాపకముంచుకొందము. దేవుడు నీతిమంతుల ప్రార్థన అంగీక రించును (సామె 28:9; 15:29; యోహాను 9:31).

**శారా ఆతిథ్యమిచ్చెను:** ఆదికాండము 18వ అధ్యాయమును మరొకమారు చదువుము. ఆతిథ్యమిచ్చుటకు అబ్రా హాము రెండుమారులు పరుగెత్తికొని వెళ్లినట్లు లేఖనములు చెప్పుచున్నవి. ఏదైనా అవుసరం యున్నప్పుడు దానిని తీర్చుటకు అతడు చురుకుగా పనిచేసెను. "ఆతిథ్యము చేసిరి" యని హెబ్రీ 13:1-2 చెప్పుచున్నది. ఆదికాండము 18లో

అబ్రాహాము శారాలు ముగ్గురు దేవ దూతలకు ఆతిథ్యమిచ్చుటలో శ్రద్ధవహించాలని పౌలు చెప్పుచున్నాడు. "పరిశుద్ధుల అవసరములలో పాలు పొందుచు, శ్రద్ధగా అతిథ్యమిచ్చుచుండుడి" (రోమా 12:13).

పెద్దలుగా యుండ గోరువారు అతిథిప్రియులై యుండాలనునది అత్యవుసరము (1తిమెతి 3:2). విధవ రాండ్ర సంక్షేమమును గూర్చి వ్రాయుచు, సత్‌క్రైస్తవ విధవరాలు పరదేశులకు ఆతిథ్యమిచ్చునదై యుండునని పౌలు చెప్పాడు (1తిమోతి 5:10). "ఒకనికొకడు ఉపచారము చేయుడి" యని పేతురు వ్రాసాడు (1 పేతురు 4:9). ఆజ్ఞాపింపబడినందున కాదుగాని, అతిథి సత్కారము మన సహజ సిద్ధమైన లక్షణమై యుండాలి. నీవట్లున్నావా? అతిథులకు భోజనము సిద్ధపరచుటకు అబ్రాహాము శారాలవలె నీవు, నీభర్త ఆసక్తి కనుబపరచుదురా?

మన బంధు మిత్రులకు ఆతిథ్యమిచ్చుట తేలికయే. అయితే మన మెరుగని వారికి, పరదేశులకు ఆతిథ్య మిచ్చుటకు ఎల్లవేళలా సిద్ధపడి యుండాలి.

**తన భర్త యెడల శారా గౌరవము ప్రేమ కనుబరచెను:**

శారాను గూర్చి క్రొత్త నిబంధన మూడు సార్లు చెప్పుచున్నది. అబ్రాహామునకు చేయబడిన వాగ్దానమును గూర్చి చెబుతు శారా, రిబ్కాలను గూర్చి రోమా 9:9 లో పౌలు చెబుతాడు. విశ్వాస వీరుల పట్టికలో శారా కూడ హెబ్రీ పత్రికలో చేర్చబడి యున్నది. భార్యభర్తల సంబంధమును గూర్చి చెబుతు పేతురు శారాను ఒక మాదిరిగా చూపించెను (1 పేతురు 3:5-6). శారా అబ్రాహామును తన యజమాని యని పిలిచెను. అట్లు పిలుచుటలో

- అబ్రాహాము ఆమెకు, తన గృహానికి శిరస్సని శారా గుర్తించెను.
- గృహములోను, అబ్రాహాము హృదయములోను తన స్థానమును ఆమె గుర్తించెను.
- ఆమె స్త్రీగా యుండుటకు, అబ్రాహాముకు భార్యగా యుండుటకు సంతోషము కనుబరచెను.
- ఆమె అబ్రాహాము యెడల గొప్ప ప్రేమ కలిగియుండెను.
- అబ్రాహామును ఆమె గౌరవించెను. అతనిలో ఆమె ఆనందించెను.

నీభర్తను నీవు ఎట్లు సంబోధించుచున్నావు? అతని గూర్చి యితరులతో నీవెట్లు మాట్లాడుచున్నావు? నీ సంభాషణలలో అతనిని గౌరవించుచున్నావా? లేదా చులకన చేయుచున్నావా?

**శారా తన భర్తకు లోబడి యుండెను :**

తాను అబ్రాహాము యొక్క సోదరినని చెప్పినప్పుడు శారా అబద్ధ మాడెనా? ఆదికాండము 12, 20

అధ్యాయములలో శారా అబ్రాహాము లు బుద్ధి పూర్వకముగానే ఫరోకు, అబీమెలెకుకు తాము భార్య భర్తలమని గాక సోదరి సోదరీలమని చెప్పిరి. అందు వలన వారు నిజంగా అబద్ధమాడిరని మనం ఊహించ వచ్చును. అయితే మనం శారాను నిందించక ముందు ఇందు విషయమై లేఖనములలో ఎక్కడను శారా ఖండించబడ లేదని గ్రహించుకోవాలి.

లేఖనాలలో ఎక్కడా శారా అబ్రాహాముకు అవిధేయత చూపించినట్లు మనకు కనబడదు. శారా అబ్రాహాముకు లోబడి యుండెనని పేతురు చెప్పుచున్నాడు. ఆమెను ఒక మాదిరిగా చూపించాడు. ఎఫెసీ 5:22; కొలస్స 3:18; 1కొరింథీ 14:34-35, తీతు 2:5; 1 పేతురు 3:5-6 భార్య భర్తల మధ్య యుండ వలసిన సంబంధమును గూర్చి చెప్పుచున్న లేఖన భాగములు. భార్యలు తమ భర్తలకు లోబడి యుండా లని క్రొత్త నిబంధన చెప్పుచున్నది. నీ చర్యలన్నిటిలో నీ భర్తకు నీవు లోబడి యుందువా? క్రైస్తవ స్త్రీలు తమ భర్తలకు లోబడకుండా యుండు సందర్భము లేమైనా యున్నవా ?

మనము మనుష్యులకు గాక దేవునికే లోబడి యుండాలని అపొ.కా. 5:29 చెప్పుచున్నది. మనము మానవు లను సేవించు వారమైతే దేవుని సేవకు లము కాజాలమని గలతీ 1:10 చెప్పు చున్నది. ఈ లేఖనములు వ్రాయబడి నపుడెంత విలువగలవో, ఇప్పుడును అంతే. కొన్ని ఆజ్ఞలకు అవిధేయత చూపు ఘడి యలను మనం ఎదుర్కొన వచ్చును. ఏదైనా అక్రమకార్యమును చేయుమని నీవు పనిచేయు యజమాని అడిగినపుడు, అట్టి మాటలకు నీవు లోబడ కూడదని ప్రభుత్వము, దేవుడు కూడ ఆశిస్తారు. ఇంకా, దేశ చట్టాలకు విరుద్ధమైన పనిని ఏదైనా చేయుమని నీభర్త అడిగినపుడు దేవుడు, ప్రభుత్వముకూడ దానికి లోబడరాదని కోరుదురు. దేవుని చిత్తానికి భిన్నముగా యున్న ఏ ఆజ్ఞకైనను లోబడుటకు నీవు తిరస్కరించిన యెడల ఆయన నిన్ను దోషిగా ఎంచరు. నీవు ఆరాధనకు వెళ్ళ రాదు, పన్ను చెల్లించరాదు, మత్తు పదార్థములు సేవించవలెను అని నీ భర్త నిన్ను అదేశించిన యెడల ప్రేమ పూర్వకముగా వాటిని నీవు తిరస్కరిస్తే దేవుడు ఘనపరచబడ్తారు. మనము ఎల్లప్పుడు దేవునికే లోబడవలెను.

అనేక సంగతుల విషయమై శారాను మనం జ్ఞాపకం చేసుకో వచ్చును. తాను మృతి జెందేసరికి ఆమె యొక్క వయస్సు మాత్రమే బైబిలులో రికార్డు చేయబడినది. ఆమె చనిపోవు సరికి 127 సంవత్సరముల వయస్సు గలది. ఆమె జనాంగములకు తల్లియని చెప్పబడినది. వృద్ధాప్యములో కూడ ఆమె చాల అందముగలది. మనందరివలె ఆమె

కొన్ని విషయాల్లో బలహీనురాలు, మరికొన్ని విషయాలలో బలవంతురాలు. శారాతో నీవెట్లు పోల్చుకొంటావు? ఆమె వలె నీ విశ్వాసము బలమైనదా? ఆమె వలె అతిథులను గౌరవించుదువా? ఆమె వలె నీ భర్తను ప్రేమించి గౌరవం చుదువా? నీవు నీ భర్తకు నిజముగా సాటియైన సహాయకురాలవా?

– బోని రష్మోర్

## సొదొమ - గొమొఱ్ఱా

ద్వితి 29:23,24 వచనములలో యెహోవా మోషేద్వారా ఇశ్రాయేలీయులకు ఇట్లు తెలియజేయుచున్నాడు. "వారు యెహోవా తన కోపోద్రేకము చేతను గంధకము చేతను ఉప్పు చేతను చెడి పోయి విత్తబడకయు దానిలో ఏదియు బుట్టకయు దానిలో ఏకూరయు మొలవకయూ ఉండుట చూచి యెహోవా దేనిని బట్టి యీదేశమును ఇట్లు చెసెనో ఈ మహాకోపాగ్నిని హేతువేమో అని చెప్పుకొందురు".

2 పేతురు 2:6,7 "మరియు ఆయన సొదొమగొమొఱ్ఱాలను పట్టణములను భస్మము చేసి ముందుకు భక్తి హీనులగు వారికి వాటిని దృష్టాంతముగా ఉంచుటకై వాటకి నాశనము విధించి దుర్మార్గుల కామవికార యుక్తమైన నడవడిక చేత బహు బాధపడిన నీతి మంతుడుగు లోతును తప్పించెను" సొదొమగొమొఱ్ఱా పట్టణములు ఎక్కడ ఉండేవి ? :

ఆది 13:10-12 వచనములను గమనించినట్లయిన సొదొమాగొమొఱ్ఱాలు యొర్దానుకు తూర్పు తీరమైదానములో ఉండేవి. యొర్దాను నది గలిలయ సముద్రము నుండి (తిబెరెయ సముద్రము లేక కిన్నెసరెతు సముద్రము లేక గెన్నెసెరతు సరస్సు) ప్రవహీస్తు ఉప్పుసముద్రములో కలియును. ఉప్పు సముద్రము అనగా నేటి మృతసముద్రము. కావున సొదొమగొమొఱ్ఱాలు యొర్దాను తూర్పుభాగములో మృత సముద్రమునకు ఉత్తర భాగములో ఉండేవి. "ఈ పట్టణములను యెహోవా నాశనము చేయుటకు మునుపు అది యెహోవా తోటవలెను, ఐగుప్త దేశము వలెను నీళ్ళుపారు దేశమై యుండెను". (ఆది 13:10). యెహోవా తోట అనగా ఏదేనువనము. ఏదేనువనములోనుండి ఒక నదిబయలు దేరి నాలుగు శాఖలాయెను 1. పీషోను 2. గీహోను 3. హిద్దికెలు 4. యూఫ్రటిస్. ఈ నదులు ప్రవహించుటవల్ల ఆప్రాంతాలన్ని సస్య శ్యామలముగా యున్నవి. ఆదే విధముగా

ఐగుప్తుకూడా నైలునది నీళ్ళు పారుదేశమై యున్నది గనుక అక్కడ కూడా పంటలుబాగుగాపండేవి. సొదొమగొమొఱ్ఱా అను పట్టణములు యొర్దాను నది పరివాహక ప్రాంతములో యుండుట వల్ల అక్కడ సమృద్ధియైన ఆహారము కలదు. అంతే కాకుండా అక్కడి లోయ ప్రాంతాలలో మట్టికీలు గుంటలు (Tar pits) ఉండేవి అనగా పెట్రోలు గనులు అక్కడ ఉండేది. ఆపట్టణాలు ధనికమైనవి. అవి బాగుగా కట్టబడిన పట్టణములు మంచి ఇండ్లు కూడా ఆపట్టణములో ఉన్నవి. ఆపట్టణమునకు గవిని కూడా ఉన్నది.

అనగా సొదోమగొమొఱ్ఱాలు యొర్దాను తూర్పు తీరమైదానము బాగుగా కట్టబడిన బహుసంపన్నమైన పట్టణములని మనకు తెలియుచున్నది.

**సొదొమగొమొఱ్ఱా పట్టణములను నాశనముచేయుటకు కారణములు:**

యెహెజ్కేలు 16:49,50 లో ఈలాగు వ్రాయబడెను. "ఇదే ప్రభువగు యెహోవావాక్కు : నీ చెల్లెలైన సొదొమ చేసిన దోషమేమనగా దానికిని దాని కుమార్తెల కును కల్గిన గర్వమును, ఆహార సమృద్ధిని, నిర్విచారమైన సుఖస్థితినను నదియే; అది దీనుల కును దరిద్రుల కును సహాయము చేయు కుండెను. వారు అహంకరించి నాదృష్టికి హేయ మైన క్రియలుచేసిరి కనుక నేను దాని చూచి వారిని వెళ్లగొట్టితిని".

ఈవాక్యభాగమునను సరించి సొదొమాగొమొఱ్ఱాల హృదయ స్థితిని గమనిద్దాం.

**గర్వము (అహంకారము):**

సొదొమగొమొఱ్ఱాలకు గల మొదటి గుణము గర్వలము. ధన సమృద్ధి ఉన్నదనే గర్వము. అహంకారము లెక్కలేని తనము వీరిలో కనబడుచున్నది. గర్వము అనునది సాతాను యొక్క లక్షణము (యెషయా 14:12-15). "తేజోనక్షత్రమా వేకువచుక్కానీవెట్లు ఆకాశము నుండి క్రిందికి పడితివి?................ మహోన్నతునితో నన్ను సమానునిగా చేసికొందును అని నీవు మనస్సులో అనుకొంటివి కదా?" యెహెజ్కేలు 28:17 "నీ సౌందర్యమును చూచుకొని గర్వించినవాడవై, నీ తేజస్సును చూచుకొని నీజ్ఞానమును చెరుపుకొంటివి. కావున నేనునిన్ను నేలను పడగొట్టితిని".

సాతానుడు సౌందర్యవంతుడు, తేజోవంతుడు, జ్ఞానవంతుడు, దేవుని సన్నిధిలో ఉన్నతమైన స్థానములో ఉన్నవాడు అయినప్పటికి గర్వించినవాడై దేవునితో సమాన హోదాను మనస్సులో ఆశించెను. మనస్సులో అనుకొన్న సాతాను యొక్క గర్వము

దేవుడు ఎరిగిన వాడై అతనిని పరలోకము నుండి నేలకు పడద్రోసెను.

సామె 16:18 "నాశనమునకు ముందు గర్వము నడచును. పడిపోవుటకు ముందు అహంకారమైన మనస్సు నడచును. యెష 2:11 "నరుల అహంకారదృష్టి తగ్గింపబడును మనుష్యుల గర్వము అణగద్రొక్కబడును"

గర్వమునకు పరలోకములో స్థానములేదు. గర్వమునాశనమునకు నడిపించును. గర్విష్టులకు దేవునియొక్క సన్నిధిలో స్థానములేదు.

సొదొమగొమొఱ్ఱా ప్రజలు గర్వము కల్గినవారిగా యెహోవా దేవుడు గుర్తించాడు. కనుక గర్వము కల్గియుండ కూడదు. ఎల్లప్పుడు దేవునికి విధేయులుగా వినయమనస్కులుగా ఉండాలి.

**తిండిపోతుతనము:–**

సొదొమగొమొఱ్ఱా యొర్దాను నదీ తీరమైదానములో ఉన్నది గనుక అక్కడ పంటలు బాగుగా పండేవి. కనుక అక్కడ ఆహార సమృద్ధి యున్నది. వారికి కావలసినంత తిండి యుండేది. ఆహారము కొరకై చింతించకుడని దేవుని వాక్యము సెలవిచ్చుచున్నది మత్తయి 6:25. కాగా అన్న వస్త్రములు గల వారై యుండి వాటితో తృప్తి పొంది యుందము. రోమా 14:17 "దేవుని రాజ్యము భోజనమును పానమును కాదు గాని నీతియు సమాధానమును పరిశుద్ధాత్మయందలి ఆనందమునై యున్నది". తిండిపోతులు త్రాగు బోతులు దేవుని రాజ్యములో ప్రవేశింపరని దేవుని వాక్యము చెప్పుచున్నది (సామె 23:2). "నీవు తిండి పోతువైన ఎడల నీ గొంతుకు కత్తి పెట్టుకొనుము. అయితే ఎలాంటి ఆకలిని కల్గియుండాలి. మత్తయి 5:6 "నీతికొరకు ఆకలిని కల్గియుండి, మెలకువ కలిగి ప్రార్థన చేయాలి.

**సోమరితనము : –**

ఆహార సమృద్ధి, ధనసమృద్ధి కలిగి యుండుట వలన నిర్విచారమైన సుఖస్థితికలుగుతుంది. దీని గురించి విచారించే లేక చింతించే పరిస్థితి ఉండదు అందువల్ల సోమరితనము పెరుగుతుంది. సొదొమ ప్రజలు నిర్విచారమైన సుఖస్థితిని కల్గియున్నారు. అన్ని కల్గియున్నపుడు దేనిని గూర్చి ఆలోచించము. మనకు కష్టములు కల్గినపుడుమాత్రమే దేవుడు మనకు జ్ఞాపకమునకు వస్తాడు. ధనవంతుడు కొట్లలో ధాన్యము ధనమును సమకూర్చుకొని నాప్రాణమా తినుము త్రాగుము సుఖించుము అని తలంచుచున్నాడు. నిర్విచారముగా యున్నాడు. దేవుడు తన ప్రాణమును తీసికొన్నట్లయిన అధన ధాన్యాలతో ఏమి ప్రయోజనము? కనుక వారు నిర్విచారస్థితి కల్గియున్నారు అనగా సోమరితనము కల్గియున్నారు. సామె

6:11 "సోమరితనముగలవానికి దోపిడి గాడువచ్చునట్లు దారిద్ర్యము వచ్చును" సామె 19:15. "సోమరితనము గాఢ నిద్రలో పడవేయును సోమరివాడు పస్తుపడియుండును".

ఇంగ్లీషులో ఒకసామెత యున్నది "An Idle man's mind is the devil's workshop"" నిర్వ్యాపారము గా యున్నవాని హృదయములో నుండి అనేక దురాలోచనలు వచ్చును. మత్తయి 12:43, 44లో ఈలాగు వ్రాయబడెను. "అప విత్రాత్మ ఒక మనుష్యుని వదలి పోయిన తరువాత విశ్రాంతి వెదకుచు నీరులేని చోట్ల తిరుగుచుండును. విశ్రాంతి దొరకనందున నేను వదలివచ్చినను ఇంటికి తిరిగి వెళ్లుదుననుకొని ఆ ఇంట ఎవరును లేక అది ఊడ్చి అమర్చి యుండుట చూచివెళ్లి తన కంటె చెడ్డ వైనమరి ఏడు దయ్యములను వెంట బెట్టుకొని వచ్చి దానిలో ప్రవేశించి అక్కడనే కాపురముండును. కనుక ఆవ్యక్తి స్థితి మునపటి కంటే భయంకరముగా యుండెను. సొదొమ గొమొఱ్ఱాప్రజలు నిర్వ్యాపారమైన సుఖస్థితి కల్గి యుండుట వల్ల వారిలో అనేక దురాలోచనలు బయలు వెడలెను.

రక్షింపబడిన తరువాత మన హృదయములు దేవుని వాక్యముతో నింపబడాలి. రక్షింపబడ్డాములే అని నిర్వ్యాపారముగా ఉన్నట్లయిన మన హృదయములోనికి సాతాను ప్రవేశించి దరాలోచనలు కలుగజేస్తాడు కనుక ఎల్లప్పుడూ వాక్యము చదువుతూ మన జీవితాలను సరిచేసికొనవలెను.

అది (సొదొమగొమొఱ్ఱా) దీనులకు సహాయము చేయకుండెను (స్వార్థపరులు) యెహెజ్కే 16:50. సొదొమగొమొఱ్ఱా ప్రజలకు ధనసమృద్ధి ఉన్నది, ఆహార సమృద్ధి ఉన్నది గాని దీనులకు సహా యము చేయుకుండెను. వారు స్వార్థ పరులు. కీర్తన 41:1 "బీదలను కటాక్షిం చువాడు ధన్యుడు ఆపత్కాలములో యెహోవా వానిని తప్పించును" సామె19:17 "బీదలను కనికరించువాడు యెహోవాకు అప్పిచ్చువాడు వాని ఉపకారమునకు ఆయన ప్రత్యు పకార ముచేయును. యాకోబు 1:27 "తండ్రి యైన దేవుని ఎదుట పవిత్రమును నిష్కళంకమునైన భక్తి యేదనగా - దిక్కులేని పిల్లలను విధవరాండ్రను.....

**మీరు సత్యవాక్కు సాలు చందా చెల్లించారా? లేదా**(టైటిల్ 3వ పేజీలో)

**ఇప్పుడే 50/- రూ॥లు పంపించి మీ పత్రిక**

**కొనసాగించుకొనండి. క్రొత్తవారిని చేర్పించండి.**

**- ఎడిటర్**

వారి ఇబ్బందులలో పరామర్శించుటయు, ఇహలోకమాలిన్యము తన కంటకుండా తన్ను తాను కాపాడుకొనుటయునే"

**కృతజ్ఞతలేనివారు :** ఆది 14 అధ్యాయములో ఆయా రాజులు వారి ఆస్థిని వారితో పాటు లోతు యొక్క ఆస్థిని కొల్లగొట్టుకొని పోయినపుడు అబ్రాము 318 మందితో వెళ్ళి వారిని జయించి వారి ఆస్థి యావత్తును తిరిగి తెచ్చెను. అపుడు సొదొమరాజైన బెల అబ్రామునకు కృతజ్ఞతలు చెప్పుటకు బదులుగా జనులను నాకిచ్చి ఆస్థిని నీవు తీసి కొనుమని చెప్పెను (ఆది 14:21) కాని అబ్రాము తీసికొనుటకు నిరాకరించెను. అబ్రాము షాలేమురాజై మెల్కీసెదెకునకు పదియవవంతు ఇచ్చెను సొదొమా వారు కృతజ్ఞత లేని వారు. దేవుని దృష్టికి హేయమైన క్రియలు చేసిరి : వారు పురుషసంయోగులు (ఆది 19:5). ఇక్కడ బాలురు, యౌవనులు, వృద్ధులు ప్రజలందరూ దేవుని దృష్టికి హేయమైన క్రియలు చేసిరి. సొదొమగొమొఱ్ఱాల ప్రజల హృదయము పాపముతో కూడిన ధురాలోచనతో నిండిపోయింది. వారు పురుషసంయోగులు ఇది నీచమైనది. ఈ దినాలలో కూడ ప్రజలు సొదొమ గొమొఱ్ఱాలవలె దేవుని దృష్టికి హేయకార్యములు చేయుచున్నారు.

పైన చూసిన దుష్కార్యములన్నియు దేవుని దృష్టికి హేయమైనవిగా ఉండుటవలన, ఇట్టి దుష్టకార్యములు తారస్థాయికి చేరుట వలన, క్షమాపణకు అవకాశము లేని స్థితిలో ఉండుట వల్ల దేవుని యొక్క కోపాగ్నిక్కి గురై పదిమంది నీతిమంతులు కూడా అక్కడ లేకపోవుటవల్ల సొదొమా గొమొఱ్ఱాలు అగ్ని గంధకములతో దహించివేయబడ్డాయి.

సొదొమా గొమొఱ్ఱాలను ఎందుకు దృష్టాంతములుగా ఉంచి దేవుడు మనకు హెచ్చరిక చేయుచున్నాడు? 2 పేతురు 2:6 చెప్పబడినట్లుగా భక్తి హీనులగువారికి వాటిని దృష్టాంతముగా ఉంచెను. 1 కొరింధి 6:9 జారులైనను, విగ్రహారాధికులైనను, వ్యభిచారులైనను, ఆడంగి తనము గల వారైనను, పురుష సంయోగులైనను, దొంగలైనను, లోభులైనను, త్రాగుబోతులైనను, దూషకులైనను, దోచుకొనువారైనను దేవుని రాజ్యమునకు వారసులు కానేరరు. యూదా: 7 వ "సొదొమగొమొఱ్ఱాలు వాటి చుట్టుపట్లనున్న పట్టణములును వీరివలెనే వ్యభిచారము చేయించు పర శరీరానుసారాలైనందున నిత్యాగ్ని దండన అనుభవించుచు దృష్టాంతముగా ఉంచబడెను".

యేసుక్రీస్తు తన పన్నెండు మంది శిష్యులను పరలోక రాజ్యము సమీపించి యున్నదని ప్రకటించుమని పంపించినపుడు ఆయన ఈలాగు చెప్పెను. మత్తయి

10:14,15 “ఎవడైనను మిమ్మును చేర్చుకొనక మీమాటలు వినకుండిన ఎడల మీరు ఆ ఇంటినైనను, ఆ పట్టణమునైనను విడచి పోవునపుడు మీ పాదధూళి దులిపి వేయుడి విమర్శదినమందు ఆ పట్టణపు గతికంటె సొదొమ గొమొఱ్ఱాలగతి ఓర్వదగినదై యుండునని నిశ్చయముగా మీతో చెప్పుచున్నాను”

కావున రక్షణ సువార్తను విని మారుమనస్సు పొంది క్రీస్తులోనికి బాప్తీస్మము పొందకుండా ఉన్నట్లయితే నిత్య అగ్ని గుండములో పడవేయ బడతారు. అక్కడ అగ్ని ఆరదు పురుగు చావదు. సొదొమ గొమొఱ్ఱాల పై కురిపించిన అగ్ని ఆరిపోయి నేటికిని ప్రపంచములో మృత సముద్రమునకు సమీపములో దృష్టాంతముగా యున్నది. దేవుని వాక్యమునకు లోబడిన వారికి నిత్య నరకము ఎల్లప్పుడు మండుచూ సిద్ధముగా యున్నది. ఆ నరకమునుండి తప్పించుకొనుటకు ఇదియే సమయము క్రీస్తుని రక్షకునిగా అంగీకరించి. ఆనరకము నుండి తప్పించుకొందము.

– బి.యస్.ఎ. సువార్త

RNI Regd. No. 69973/98
Postal Regd. No. AP-VM/KD/02/2012-2014

To

From:
**SATYA VAKKU**
P.O. Box 80, Kakinada - 533 001

Edited & Published by Joshua Gootam. Printed by him at Satya Vani Publication, Sambamurthy St., Kakinada - 533